


రంజాన్ వేళలు

బుధవారం	గురువారం
ఇఫ్తార్ :	సహర్ :
సా. 6.35	ఉ. 4.51

ఉపవాసం పాటించు.. దానికి మించిన సదాచారణ మరొకటి లేదు..





కాంగ్రెస్ టికెట్ దక్కేదెవరికో?

ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిపై వీడని ఉత్కంఠ

ఆదిలాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి)

- నేడు ఖరారు కానున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి!
- ఆదివాసీ ఉపాధ్యాయురాలు ఆత్రం సుగుణ వైపే మొగ్గు ?
- లంబాడా నేతల నుంచి వెల్లువెత్తుతున్న అభ్యంతరాలు
- బంజారా గర్జన పేరిట ప్రత్యేక సమావేశానికి సన్నద్ధం
- వేచిచూసే ధోరణితో కనిపిస్తున్న ఆశావహ నేతలు

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ఖరారు కావడంతో ప్రధాన పార్టీలు ధీటైన అభ్యర్థుల వేటలో పడ్డాయి. ఇప్పటికే బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు అభ్యర్థులను ఖరారు చేయడంతో ఇక కాంగ్రెస్ అభ్యర్థి ఎవరన్నదే సర్వత్రాఆసక్తి కనిపిస్తుంది. కాంగ్రెస్ అభ్యర్థి కూడా దాదాపుగా ఖరారైనట్లుగానే పార్టీ వర్గాలు చెబుతున్న అధికారిక ప్రకటనపై ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ టికెట్ కోసం భారీ డిమాండ్ ఏర్పడుతుంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన రాథోడ్‌రమేష్ ప్రస్తుతం బీజేపీ పార్టీలో కొనసాగడంతో కొత్త అభ్యర్థుల పై పార్టీ అధిష్టానం దృష్టి సారించింది. ఇప్పటికే ఒకరిద్దరు నేతల పేర్లను ఫైనల్ చేస్తూ కేంద్ర అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లిన ప్రకటన చేయడం కొంత ఆలస్యమవుతుంది. బుధవారం కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం అయ్యే అవకాశం ఉన్నందున ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పై స్పష్టత వచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఓ వర్గం నేతలు ఆదివాసీ అభ్యర్థికి మద్దతునివ్వగా మరో వర్గం నేతలు లంబాడా సామాజిక వర్గానికి చెందిన నేతలకు అండగా నిలుస్తూ వస్తున్నారు. దీంతో అభ్యర్థి ఎంపిక కాంగ్రెస్ అధిష్టానానికి కొంత ఇబ్బందికరంగా మారిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే జిల్లా ఎమ్మెల్యే, ముఖ్య నేతలు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలతో మాట్లాడిన అధిష్టానం పెద్దలు తుది నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తుంది. పార్లమెంట్ పరిధిలోని తాజా రాజకీయ పరిణామాలు,నేతల సామాజిక సమీకరణలను పరిగణలోకి తీసుకుని అభ్యర్థి ఎంపిక ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఆశావహ నేతలంతా కొంత కాలం పాటు వేచి చూసే ధోరణితోనే కనిపిస్తున్నారు. పార్లమెంట్ పరిధిలో మరిన్ని రాజకీయ సమీకరణలు చోటు చేసుకునే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

బరిలోకి మహిళా నేత

కాంగ్రెస్ టికెట్ కోసం పలువురు ఆశావహ నేతలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నా.. మారిన రాజకీయ సమీకరణల్లో భాగంగా లోక్‌సభ ఎన్నికల బరిలోకి ఆదివాసీ మహిళ నేతను దింపేందుకు కాంగ్రెస్ పార్టీ రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తుంది. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిపోయిన మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంపీ టికెట్‌పై హామీ ఇచ్చారన్న ప్రచారం కూడా జరుగుతుంది. దీంతో రేఖానాయక్ కూడా టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తుంది. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఆదివాసీ నేతలను ఎన్నికల బరిలో దింపడంతో మహిళల ఓట్లను రాబట్టేందుకు కాంగ్రెస్ కొత్త ఎత్తుగడను వేస్తున్నట్లు తెలుస్తుంది. ప్రత్యర్థి పార్టీల వ్యూహాలను చిత్తు చేస్తూ ఆదివాసీ సామాజిక వర్గానికి చెందిన ఉపాధ్యాయురాలు ఆత్రంసుగుణ అభ్యర్థిత్వాన్ని దాదాపుగా ఖరారు చేసినట్లు పార్టీలో ప్రచారం జరుగుతుంది. అయితే డాక్టర్ సుమలతతో పాటు ఆత్రంభాస్కర్ పేర్లు కూడా ప్రధానంగా వినిపిస్తున్నాయి. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ధీటుగా మహిళ నేతను ఎన్నికల బరిలోకి దింపి పార్లమెంట్ స్థానాన్ని తనఖాతాలో వేసుకునేందుకు కాంగ్రెస్ పక్కాప్లాన్‌తో ముందుకెళ్తున్నట్లు చెబుతున్నారు.

లంబాడాలకు ప్రాధాన్యత ఏదీ!?

పార్లమెంట్ ఎన్నికల్లో లంబాడా సామాజిక వర్గానికి చెందిన నేతలకు ప్రాధాన్యతను ఇవ్వకపోవడం పార్లమెంట్ పరిధిలో చర్చనీయాంశంగా మారింది. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ ఇప్పటికే ఆదివాసీ నేతలకు అవకాశం కల్పించాయి. కనీసం కాంగ్రెస్ పార్టీ అయిన లంబాడాలకు అవకాశం ఇవ్వాలన్న డిమాండ్లు వస్తున్నాయి. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ లంబాడాలకు అవకాశం ఇచ్చిన మూడవ స్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈసారి అవకాశం ఇస్తే గెలుపు అవకాశాలు ఎలా ఉంటాయోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో మూడు ప్రధాన పార్టీలు లంబాడా నాయకత్వాన్ని పక్కన పెట్టినట్లుగానే కనిపిస్తుంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఖానాపూర్ నియోజకవర్గంలో ఆదివాసీ అభ్యర్థిని బరిలోకి దింపి కాంగ్రెస్ సక్సెస్ అయ్యింది. అదే బోథ్, ఆసిఫాబాద్ నియోజక వర్గాలలో లంబాడా నేతలకు అవకాశం కల్పించడంతో ఓటమి పాలైంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎంపీ అభ్యర్థిగా లంబాడా నేతలను బరిలోకి దింపేందుకు కాంగ్రెస్ వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తుంది. అన్ని పార్టీలు ఆదివాసీల వైపే మొగ్గు చూపడంతో కాంగ్రెస్ కూడా ఆదివాసీ నేతకే జై కొట్టే అవకాశాలు లేక పోలేదంటున్నారు. కానీ ప్రధాన పార్టీల తీరుపై లంబాడా సామాజిక వర్గం నేతలు లోలోన రగిలి పోతున్నట్లు తెలుస్తుంది.

ఒక్కటవుతున్న నేతలు

లోక్‌సభ ఎన్నికల్లో లంబాడా సామాజిక వర్గానికి ప్రాధాన్యత దక్కక పోవడంతో పార్టీలకతీతంగా లంబాడా నేతలంతా ఒక్కటవుతున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బంజారా గర్జన పేరిట భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ప్రకటించిన తర్వాత బహిరంగ సభను నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిసింది. కాంగ్రెస్ కూడా లంబాడాలకు అవకాశం ఇవ్వకుంటే ఉమ్మడి అభ్యర్థిగా ఎవరినో ఒకరిని ఎన్నికల బరిలోకి దింపాలనే ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తుంది. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలలోని లంబాడా సామాజిక వర్గానికి చెందిన నేతలంతా ఇప్పటికే తీవ్ర అసంతృప్తితో కనిపిస్తున్నారు. పైపైకి బాగానే కనిపిస్తున్న లోలోన మాత్రం పార్టీల అధిష్టానం తీరును తప్పుబడుతున్నారు. ఇప్పటికే సోషల్ మీడియాల్లో బంజారాల గర్జన పేరిట పలురకాల పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. అయితే ఇప్పటికే అప్రమత్తమైన పార్టీలు లంబాడా సామాజిక వర్గానికి చెందిన నేతలను బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నాయి.



బాలికల చదువును పరీక్షిస్తున్న పీవో ఖుష్బు గుప్తా

వసతి గృహ విద్యార్థులకు మెరుగైన విద్యనందించండి

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా

ఉట్నూర్, మార్చి26: ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. ఆ చించుఘాట్ గిరిజన సంక్షేమ ప్రాథమిక మోడల్ స్కూల్, వన్నాట్ ఆశ్రమ ఉన్నత పాఠశాల, జండగూడ, మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం పీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతీరోజు మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని అన్నారు. నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతీరోజు వంట గది, స్టోర్‌రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి : డీఎస్పీ

ఉట్నూర్, మార్చి26: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలను ప్రజలందరూ ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ అన్నారు. మంగళవారం ఉట్నూర్ పోలీసుల ఆధ్వర్యంలో పారామిలిటరీ పోలీసుల సహకారంతో పట్టణంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాగేందర్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ఎలాంటి ఆపోహలకు గురికాకుండా ఉండడానికి పోలీసు కవాతు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గండికోట మొగిలి పాల్గొన్నారు.



లక్ష్మీపూర్ చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ

వాహనంలో తనిఖీలు చేస్తూ..

సరిహద్దు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎస్పీగౌస్‌ఆలం
- రెండు చెక్‌పోస్టుల తనిఖీ
- అక్రమ మద్యం, డబ్బు, గంజాయిని జిల్లాలోకి రానివ్వొద్దని పోలీసు సిబ్బందికి ఆదేశం

తలమడుగు, మార్చి26: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం అన్నారు. మహారాష్ట్ర బోర్డర్‌లో ఏర్పాటు చేసిన ఆరు చెక్‌పోస్టుల్లో.. ఒకటైన తలమడుగు మండలం లక్ష్మీపూర్ చెక్‌పోస్టును జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం మంగళవారం సాయంత్రం తనిఖీ చే శారు. అదే విధంగా మహారాష్ట్రలో ఉన్న పిప్పల్‌గావ్ పాత చెక్‌పోస్టును పరి శీలించి, వాహనాలను తనిఖీ చేశారు. ఆదిలాబాద్ జిల్లాలోకి అక్రమంగా మద్యం, డబ్బు, గంజాయి, మాదక ద్రవ్యాలు, ఎన్నికలలో ప్రభావితం చేసి బహుమతులను, రవాణాకాకుండా చెక్‌పోస్టును నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. 24గంటలు చెక్‌పోస్టులోనే ఉండి తనిఖీ నిర్వహించాలన్నారు. తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో వీడియోగ్రాఫి తప్పనిసరి అని సూచించారు. రెవెన్యూ, ఎక్సైజ్ ఫారెస్టు, సిబ్బంది సమన్వయంతో పోలీసు సిబ్బంది విధులు నిర్వహించారు. సూచించారు. తలమడుగు మండలంలోకి రోడ్డు, రైలుమార్గం గుండా అక్రమంగా మద్యం ప్రవేశించకుండా రైల్వేస్టేషన్‌లో కూడా నిఘాను ఏర్పాటు చేసి ఆకస్మిక తనిఖీలను నిర్వహించాలని సూచించారు. అలాగే తలమడుగు పోలీసు స్టేషన్‌ను సందర్శించి సిబ్బంది విధులను పరిశీలించారు. చెక్‌పోస్టులనందు పూర్తి అప్రమత్తతతో ప్రజలను నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్‌సీఐ కె.ఫణిదర్, ఎస్సై ధనశ్రీ, సిబ్బంది ఏఎస్సై సురేందర్ పాల్గొన్నారు.

'సామూహిక వివాహాలు' అభినందనీయం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు
- దస్నాపూర్‌లో ఎనిమిది జంటలకు సామూహిక వివాహాలు



సామూహిక వివాహం చేసుకున్న జంటలు..



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి, మార్చి 26 : ఆదివాసీ అంధ్ గిరిజన వధూవరులకు సామూహిక వివాహాలు చేయడం అభినందనీయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. పరమహంస సద్గురు పూలాజీ బాబా ప్రేరణతో అంధ్ ఆదివాసీ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని దస్నాపూర్ గ్రామ పంచాయితీ పరిధిలోని దస్నాపూర్ గూడ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఎనిమిది జంటలకు సామూహిక వివాహాలు జరిపించారు. ఈ కార్యక్రమానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వాదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న వారికి ఇలాంటి పెళ్లిళ్లు ఎంతో మేలు చేస్తాయన్నారు. పరమహంస సద్గురు పూలాజీ బాబా చూపిన మార్గం అత్యంత గొప్పదన్నారు. మారుమూల గ్రామాల్లో ఇలాంటి మంచి కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. మున్ముందు ఇలాంటి కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ యశ్వంతరావు, కటులే పుండలిక్, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఆత్రం సుగుణ, ఎంపీపీ పోటే శోభాబాయి, జడ్పీటీసీ పుష్పలతా, ఆదివాసీ అంధ్ సంఘం జిల్లా అధ్యక్షులు ముఖడే విష్ణు, జిల్లా ప్రధాన కార్యదర్శి కరాడే మారుతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆత్రం భాస్కర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, జవాదే కేశవ్, పోటే సాయినాథ్‌తో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రకృతితో మానసిక ప్రశాంతత

బోథ్, మార్చి 26 : ప్రకృతి ఒడిలో జీవిస్తే మానసిక ప్రశాంతతతో పాటు శారీరకంగా ఎంతో ఉపయోగం లభిస్తుందని పక్షి ప్రేమికుడు వెంకటేష్ అన్నారు. మంగళవారం మండలంలోని పలు పాఠశాలల్లో పక్షుల కోసం నీటి తొట్టిలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో వెంకటేష్ మాట్లాడుతూ.. మనిషికి ప్రకృతితో విడదీయలేని బంధం ఉందన్నారు. ప్రకృతిలో ఉన్న జీవరాశులు మనిషికి ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందన్నారు. ఈ రోజుల్లో ప్రతీది కాలుష్యమేనన్నారు. కాలుష్యం బారిన పడకుండా రక్షించుకుంటే ఆయుష్షు ప్రమాణం పెరుగుతుందని వివరించారు.



పాఠశాలలో నీటి తొట్టిలపై అవగాహన కల్పిస్తున్న వెంకటేష్



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపండి : ఎంపీడీవో

తాంసి, మార్చి 26 : మండలంలోని ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన నర్సరీలలో మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ద చూపాలని ఎంపీడీవో మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గిర్గావ్‌లో ఉన్న నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రతీ నర్సరీలో పది వేల మొక్కలకు సరిపడా సంచులను నింపి సిద్దంగా ఉంచాలన్నారు. కార్యదర్శులు వారి వారి విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఆదేశించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న ప్రత్యేక అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. నర్సరీల విషయంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

వాగులో పడి ఒకరి మృతి

నేరడిగొండ, మార్చి26: మండలంలోని వాగ్ధారి గ్రామ సమీపంలో గల కడెంనది వాగులో పడి పాటిల్ భారత్(51) అనే వ్యక్తి మృతి చెందాడు. నార్నూర్ మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన పాటిల్ రెండు నెలల క్రితం కూలిపని చేసుకునేందుకు వాగ్ధారి గ్రామానికి వచ్చాడు. సోమవారం సాయంత్రం వాగులో స్నానానికి వెళ్లగా ప్రమాదవశాత్తు అందులో పడి మరణించాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీకాంత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి26 : కాంగ్రెస్ పార్టీలోకి చేరికల జోరు కొనసాగుతూనే ఉంది. మంగళవారం ప్రజాసేవా భవన్‌లో క్రిస్టియన్ కమిటీ మహిళా జిల్లా అధ్యక్షురాలు ఆలంరూప రోసిన్ ఆధ్వర్యంలో పలువురు క్రిస్టియన్ కమ్యూనిటీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన కొనసాగుతోందన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు అందుకున్న పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డి, జైనథ్ జడ్పీటీసీ తుమ్మల అరుంధతి- వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మా సంతోష్, బాయిన్‌వార్ గంగారెడ్డి, అల్లూరి భూమారెడ్డి, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బోనాలతో పెద్దమ్మ తల్లి ఆలయానికి భక్తులు

బోథ్, మార్చి 26 : మండలంలోని కౌటా(బి) గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించిన పెద్దమ్మ తల్లి ఆలయానికి గ్రామ మహిళలు మంగళవారం వెయ్యి బోనాలను నెత్తిన ఎత్తుకుని తరలివెళ్లారు. మెడలో మాత కండువాలు ధరించి భారీ సంఖ్యలో మహిళలు ఊరేగింపుగా వెళ్లారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి

● జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో చీఫ్ సెక్రటరీ శాంతికుమారి

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి26:గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరా, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, సీఎంఆర్ లక్ష్యాలపై మంగళవారం హైదరాబాద్ నుంచి అన్నిజిల్లా కలెక్టర్లతో చీఫ్ సెక్రటరీ శాంతికుమారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించి జిల్లాలోని పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. యాసంగి పంట కోతలకు వస్తున్న నేపథ్యంలో జిల్లా స్థాయిలో వరి కోతలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిననుసరిస్తూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాల్సి ఉంటుందని, అధికారులు మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభోత్సవం చేయాలన్నారు. ప్రతి జిల్లాలో వరికోతలననుసరించి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుషెడ్యూల్ రూపొందించుకోవాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కల్పించాల్సిన సౌకర్యాల పై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ తెలిపారు. యాసంగి పంట కొనుగోలుకు రాష్ట్ర వ్యాప్తంగా 7149 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాల్సి ఉంటుందని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌళిక వసతులు కల్పించాలని, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తాగునీ సరఫరా, టెంట్లు మౌలిక ఏర్పాట్లు చేయాలన్నారు. చివరి గింజ వరకు నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధరపై ప్రభుత్వం కొనుగోలుచేస్తుందని, రైతులు ఎక్కడ తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన అవసరం లేదనే సందేశం రైతుల వద్దకు వెళ్లేఆల అవగాహన కల్పించాలని, భారత ఆహార సంస్థ నిర్దేశించిన ధాన్యం నాణ్యత ప్రమాణాలు, తేమ శాతం పై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి సంబంధిత మిల్లర్లకు కేటాయించాలని, రైస్‌మిల్లు వద్ద ఎట్టి పరిస్థితుల్లో ధాన్యం కోత రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం రైతులు ధాన్యాన్ని తీసుకుని వచ్చే విధంగా ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకో వాలని తెలిపారు. వానా కాలం 2023-24కు సంబంధించి సీఎంఆర్ రా రైస్ డెలివరి వేగవంతం చే యాల్సిన అవసరం ఉందని, భారత ఆహార సంస్థ నిర్దేశించిన సమయానికి రైస్ డెలివరీ చేసే విధంగా ప్రతి జిల్లాలో రైస్‌మిల్లుల పని తీరును ఉన్నతాధి కారులు పర్యవేక్షించాలని, ప్రతిరోజు రైస్‌మిల్లులు పూర్తి స్థాయి సామర్థ్యంతో నడిచేలా చూడాలని, సీఎంఆర్ రైస్ డెలివరీపై కలెక్టర్‌లు ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంటుందని సీఎస్ పేర్కొన్నారు. ఈ వీడియో సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న చీఫ్ సెక్రటరీ శాంతికుమారి

బస్సు డిపో నిర్వహణలో లోపాలపై
చర్యలు చేపట్టిన ఆర్‌టీసీ ఉన్నతాధికారులు



డిపోలో వివిధ విభాగాల ఇన్‌చార్జీలతో మాట్లాడుతున్న డిప్యూటీ ఆర్‌ఎం ప్రవీణ్


వివరాలు సేకరిస్తున్న విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి

భైంసా, మార్చి 26 : మొరాయిస్తున్న బస్సులు- అవస్థలు పడుతున్న ప్రయాణీకులు అనే శీర్షికతో మంగళవారం ఆంధ్రజ్యోతి నిర్మల్ జిల్లా టాబ్లాయిడ్‌లో ప్రచురితమైన వార్తకు స్పందన లభించింది. మంగళవారం ఆర్‌టీసీ ఆదిలాబాద్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ ప్రవీణ్, విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి ఎస్.దయానంద్‌లు భైంసాకు వచ్చి డిపోలో పరిశీలనలు చేపట్టారు. డిపో నిర్వహణాధికారులతో, ఆయా విభాగాల ఇన్‌చార్జీలతో సమావేశం నిర్వహించి బస్సుల స్థితి,గతులపై పరిశీలించారు. కండీషన్‌లో లేని బస్సులకు సత్వరమే అవసరమైన మరమ్మతులు నిర్వహించి సమస్యలు ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డిపో నుంచి బస్సు బయలు దేరే సమయంలో కండీషన్‌ను పర్యవేక్షించి పంపాలని సూచించారు. మార్గమధ్యంలో బస్సులు నిలిచిపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి ఎస్.దయానంద్, హెడ్ కానిస్టేబుల్ భగవంత్‌రావ్‌లు డిపో పరిధిలోని సంస్థ, అద్దె బస్సుల పరిస్థితిని పర్యవేక్షించారు. మార్గమధ్యంలో నిలిచిన బస్సు సర్వీసులు, కారణాల వివరాలను సేకరించారు.

ఆర్‌టీసీ నిబంధనలను
అతిక్రమించిన దుకాణాలకు జరిమానా


ఆర్టీసీ క్యాంటీన్‌లో తనిఖీలు చేస్తున్న ఆర్‌టీసీ అధికారులు

భైంసా, మార్చి 26 : పట్టణంలోని ప్రయాణ ప్రాంగణంలో నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు చేపడుతున్న పలు దుకాణాలకు ఆర్‌టీసీ అధికారులు, విజిలెన్స్ అధికారులు జరిమానాలు విధించారు. మంగళవారం ఆర్‌టీసీ ఆదిలాబాద్ రీజియన్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి దయానంద్ ఆదేశానుసారం భైంసా విజిలెన్స్ సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్, ఆర్‌టీసీ అధికారులు ప్రయాణ ప్రాంగణంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో తనిఖీలు చేపట్టారు. ఎంఆర్‌పీ ధరలకంటే అధిక ధరలకు విక్రయిస్తున్న దుకాణాలకు, అగ్రిమెంట్‌లో పేర్కొన్న వస్తువులు కాకుండా ఇతర వస్తువులను విక్రయిస్తున్న దుకాణాలపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. ఆర్‌టీసీ సంస్థ నియమ, నిబంధనలను అతిక్రమించిన ఆరు దుకాణాలపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించినట్లుగా ఆర్‌టీసీ అధికారులు వెల్లడించారు.

బిల్లులు నిలిచిపోయిన మనఊరు - మనబడి పనులు


అసంపూర్తిగా దర్శనమిస్తున్న చామన్‌పెల్లి 'మన ఊరు - మన బడి' పథకం పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణం

లక్ష్మణచాంద, మార్చి 26 : బిల్లులు రాని కారణంగా చామన్‌పెల్లి గ్రామంలోని 'మనఊరు - మనబడి' పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో ఈ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నిర్మాణం చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ భవనం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. గత తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం 'మనఊరు - మనబడి' పథకాన్ని అమలులోకి తెచ్చిన విషయం అందరికీ తెలిసిందే. ఈ పథకం క్రింద మండలంలని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, అదనపు గదుల నిర్మాణం కోసం రూ.3 కోట్లు మంజూరు చేసింది. ఇందులో భాగంగా చామన్‌పెల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు 28 లక్షల నిధులు కేటాయించారు. ఈ పనుల కోసం గుత్తేదారు పడిగెల సురేష్ 19 లక్షల రూపాయలు ఖర్చు చేయగా ఇప్పటి వరకు కేవలం 13 లక్షల మాత్రమే ఇచ్చారని ఇంకా 6 లక్షల రూపాయలు రావాల్సి ఉందని వాపోయాడు. సకాలంలో బిల్లులు రాని కారణంగా ప్రస్తుతం పనులు నిలిచిపోయాయి. నిధులు విడుదలైతే తప్ప పనులు కొనసాగే పరిస్థితి లేదు. మండలం మొత్తం మీద ఇదే పరిస్థితి నెలకొంది. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని పనులు పూర్తయ్యేలా చూడాలని కోరుతున్నారు.

అప్పులు తెచ్చి పనులు చేశాం
బిల్లులు మాత్రం ఇవ్వటం లేదు



అప్పులు తెచ్చి మరి పనులు కొనసాగించాం. కానీ బిల్లులు మాత్రం సకాలంలో చెల్లించటం లేదు. 28 లక్షలు మంజూరు అయితే ఇప్పటి వరకు 19 లక్షల వరకు ఖర్చు చేశాం. కేవలం 13 లక్షలు మాత్రమే చెల్లించారు. ఇంకా 6 లక్షలు రావాల్సి ఉంది. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. నిధులు విడుదల చేస్తే పనులు కొనసాగిస్తాం.

పడిగెల సురేష్, గుత్తేదారు

ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావటం లేదు

ప్రభుత్వం నుండి నిధులు విడుదల కాలేదు. 'మన ఊరు - మన బడి' పథకం కొనసాగే పరిస్థితి లేదు. నూతన ప్రభుత్వం 'అమ్మ ఆదర్శ పాఠశాలలు' పేరుతో మరో పథకం అమలు చేయనున్నట్లు సంకేతాలు ఉన్నాయి. రాని బిల్లులు ఈ పథకం ద్వారా పొందే అవకాశం ఉండవచ్చు.

- శ్రీధర్, పంచాయతీ రాజ్ ఏఈఈ

పోలింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్ ప్రక్రియ

● ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షిషా

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 26 : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా మంగళవారం పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ రాజార్షిషా పూర్తి చేశారు. జిల్లాలోని రెండు అసెంబ్లి నియోజక వర్గాల పరిధిలో గల పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు (పీఓ), సహాయ ప్రిసైడింగ్ అధికారులు(ఏపీఓ)లను,ఇతర పోలింగ్‌అధికారులు (ఓపీఓ)లను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. జిల్లా పరిధిలోని రెండు సెగ్మెంట్లకు గాను మొత్తం 4385 మంది పోలింగ్ సిబ్బందిని నియమిస్తూ ర్యాండమైజేషన్ జరిపారు. వీరిలో పీఓలు, ఏపీఓలు 2240 మంది ఉండగా ఓపీఓలు 2145 మంది, పోలింగ్ సిబ్బందికి ఎంపిక చేసిన వివిధ కేంద్రాలలో మాస్టర్ ట్రైనర్స్‌చే పోలింగ్ నిర్వహణ పై శిక్షణ తరగతులు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని పోలింగ్ విధుల కోసం నియమించబడిన సిబ్బందికి తక్షణమే ఉత్తర్వులు అందజేయాలని అధికారులను ఆదేశించారు. శిక్షణలో భాగంగా ఫారం 12 కౌంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఆదిలాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఇచ్చోడలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో ఎన్నికల డ్యూటీలో ఉన్న ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకొనుటకు గాను డ్యూటీలో ఉన్న ఉద్యోగుల కోసం పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మాస్టర్ ట్రైనర్లచే పోలింగ్ నిర్వహణ పై శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని,పోలింగ్ విధుల కోసం నియమించబడిన సిబ్బందికి తక్షణమే ఉత్తర్వులతో పాటు ఫాం 12ను కూడా అందించాలని అధికారులను ఆదేశించారు. శిక్షణలో ప్రొజెక్టర్, ఈవీఎంలు తప్పని సరిగా ఉండాలని సూచించారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్, ఆర్డీఓ, ఎంఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్‌భూమిలో అక్రమంగా మొరం తవ్వకాలు

● తవ్వుతున్న యంత్రాలను స్వాధీన పరుచుకున్న అధికారులు ● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన


అసైన్డ్ భూములో అక్రమంగా తవ్వుతున్న యంత్రాలను స్వాధీనం చేసుకుంటున్న రెవెన్యూ, మైనింగ్ అధికారులు

తలమడుగు, మార్చి 26 : మండలంలోని కజ్జర్ల శివారు ప్రాంతంలోని అసైన్డ్ భూముల నుంచి జోరుగా అక్రమ తవ్వకాలు అనే కథనం ఈ నెల 25న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురణ కావడంతో స్పందించిన తహసీల్దార్ రాజమోహన్ మైనింగ్ శాఖ ఏడీ రమేష్ మనిషాకార్ టెక్నికల్ అసిస్టెంట్ ఆర్ఐ రోహిదాస్ అధికారులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి అసైన్డ్‌భూములలో నుంచి అక్రమ తవ్వకాలు నిర్వహిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించి మొరం తవ్వకాలు నిర్వహిస్తున్న జేసీబీ యంత్రాలను స్వాధీన పరుచకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజమోహన్ మాట్లాడుతూ అనుమతి లేకుండా అసైన్డ్ భూములలో నుంచి ఎవరు మొరం తవ్వకాలను నిర్వహించవద్దన్నారు. అక్రమంగా మొరం తరలిస్తే బాధ్యుల పై శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. అంతే కాకుండా మొరం తవ్వకాల ప్రాంతాల్లో భారీ యంత్రాలను విడిచి పెట్టి వెళ్లిపోయిన సంబంధిత యజమానులు వచ్చి నష్ట పరిహారం చెల్లించి యంత్రాలను తీసుకెళ్లన్నారు. లేని యెడల ఆర్డీఓ మైనింగ్‌శాఖ అధికారుల సహకారంతో భారీ జరిమానా విధించడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా అసైన్డ్ భూముల్లో తవ్వకాల సమయంలో పక్కనే ఉన్న విద్యుత్ టవర్ వద్ద ఉన్న గుంతను పూడ్చాలని సూచించారు. కాగా ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో రెవెన్యూ అధికారులు, మైనింగ్ అధికారులుపోలీసు శాఖ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి పెట్రోలింగ్ నిర్వహించడంతో అక్రమంగా మొరం తలరించిన సంబంధిత యజమానులు పరారీలో ఉన్నట్లు సమాచారం.

దానాలలో కెల్లా గొప్పది అన్నదానం : ఎమ్మెల్యే పాయల


అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే పాయలశంకర్, ఇస్కాన్ నిర్వాహకులు

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి 26 : ఇస్కాన్, పాయలశంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5కే భోజనం పథకాన్ని స్థానిక వినాయకచవితిలోని గోపాలకృష్ణ మఠం వద్ద పీఠాధిపతి యోగానంద సరస్వతి, ఇస్కాన్ నిర్వాహకులతో కలిసి ఎమ్మెల్యే పాయలశంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దానాలలో కెల్ల గొప్పది అన్నదానం అన్నారు. అలాంటి మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు తమకు వీలైనంతలో చేయాలని సూచించారు. పట్టణంలోని రైతు బజార్, వినాయక ప్రాంతాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతులు వివిధ పనుల కోసం వచ్చే వారు అధికసంఖ్యలో ఉంటారన్నారు. రైతు బజార్‌లో రైతులు ఉంటారని వీరందరికి అతి తక్కువ ధరతో టీ కన్నా కూడా తక్కువ ధరతో వారికి భోజనం ఏర్పాటు చేయాలని ఉద్దేశ్యంతో ఇస్కాన్ సంస్థ వారితో కలిసి పాయలఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు.ఇంకా ఎవరైనా ముందుకు వస్తే వారితో కలిసి రైతుల కోసం వివిధ మార్కెట్‌యార్డులలో భోజనాలను ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ సంస్థ నిర్వాహకులు, భారతీయ జనతా పార్టీ నాయకులు పాయలశరత్, రాజేశ్, విజయ్, రాజశేఖర్, సాయి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు పెరిగిన కరువుభత్యం వెంటనే అమలు చేయాలి

● తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ నిర్మల్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. గంగన్న


కరపత్రాలను విడుదల చేసి, మాట్లాడుతున్న గంగన్న

లక్ష్మణచాంద, మార్చి 26 : బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న అన్ని రకాల కేటగిరీల కార్మికులు, బీడీప్యాకర్స్, బీడీచాటర్స్, గంపవాలా, బట్టీవాలా కార్మికులందరికీ పెంచిన కరువు భత్యాన్ని వెంటనే అమలు చేయాలని లక్ష్మణచాంద మండలంలోని చింతల్‌చందా గ్రామంలో మంగళ వారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల బీడీవర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. గంగన్న మాట్లాడుతూ... పెరిగిన కరువు భత్యం తెలంగాణ రాష్ట్రంలో ఏడు లక్షల మంది బీడీ కార్మికులకు వర్తిస్తుందని దీనిని వెంటనే అమలు చేయాలని బీడీ యాజమాన్యాలను డిమాండ్ చేశారు. కొన్ని బీడీ యాజమాన్యాలు పెరిగిన కరువుభత్యాన్ని కార్మికులకు అమలు చేయకుండా కుట్రలు చేసేటటువంటి విధానాన్ని మార్చుకోవాలని వారిని హెచ్చరించారు. కార్మికుల పొట్టకొడితే యాజమాన్యాలు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటికే కొన్ని బీడీ యాజమాన్యాలు 1000 బీడీలకు 10 రూపాయల చొప్పున కార్మికుల నిజ వేతనాల నుంచి దోచుకుంటున్నారని ఆ పద్ధతి మానుకోవాలన్నారు. వేతనం తక్కువ చెల్లిస్తున్నారని పద్ధతి మానుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రజిత, స్వప్న, శారద, నర్సవ్వ, రాజలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది

భైంసా, మార్చి 26 : క్షయవ్యాధి బారిన పడకుండా ఉండేందుకు ప్రతీ ఒక్కరూ సంబంధిత వ్యాధిపై అవగాహన పెంపొందించుకోవాలని భైంసా అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా. ఫిర్దోస్ జబీన్, ఎస్‌టీఎస్ శేషు కుమార్‌లు పిలుపునిచ్చారు. మంగళవారం భైంసా పట్టణ అర్బన్ పీహెచ్‌సీలో క్షయ వ్యాధిపై నిర్వహించిన అవగాహన సదస్సు ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. వ్యాధి నియంత్రణకు, నిర్మూలనకు చేపడుతున్న చర్యలను వివరించారు. రెండు వారాలకు మించి దగ్గు, తెమడ, సాయంత్రం జ్వరం రావడం, ఆకలి, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులను సరఫరా చేస్తోందని వివరించారు. ఇందులో అర్బన్ పీహెచ్‌సీ వైద్యఆరోగ్య సిబ్బంది, ఆశా , అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయం కోసం కలిసి కట్టుగా పనిచేయాలి

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రంసక్కు


నాయకులతో కలిసి మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి

ఆదిలాబాద్, మార్చి26 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా పని చేస్తే విజయం మనల్ని వరిస్తుందని ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆదివాసీ ముద్దుబిడ్డ ఆత్రంసక్కు అన్నారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని మన్కపూర్ గ్రామంలో మండల స్థాయి ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసిన సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా ఆదిలాబాద్ పార్లమెంట్‌లో గెలిచేది బీఆర్‌ఎస్ పార్టీ వేనని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని కోరారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నుంచి గులాబిజెండాను ఎగరవేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలం పార్టీ అధ్యక్షులు శ్రీమేస్రం హన్మంత్‌రావు, ప్రజా ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బస్సు.. బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

మావల, మార్చి 26 : బస్, బైక్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఆదిలాబాద్ రూరల్ ఎస్సై సయ్యద్ ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం జైనథ్ మండలం బెల్లూరికి చెందిన గజ్జి అశోక్, బాపురావుతో తాంసి మండలంలోని పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై గోట్కూరుకి వెళ్లారు. కాగా తిరుగు ప్రయాణంలో వస్తుండగా ఆదిలాబాద్ రూరల్ మండలంలోని జందాపూర్ ఎక్స్ రోడ్ వద్ద ఆదిలాబాద్ నుంచి వస్తున్న మహారాష్ట్ర ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో అశోక్ తలకు తీవ్ర గాయాలు కాగా బాపురావుకు గాయాలయ్యాయి. వెంటనే వారిని స్థానికులు అంబులెన్స్‌కి సమాచారం అందచేసి రిమ్స్ కి తరలించారు. ఈ మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో దొంగతనం.. సామాగ్రి ధ్వంసం

మావల, మార్చి 26 : ఆదిలాబాద్ మండలంలోని బంగారుగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తుల ఆగడాలు మితిమీరుతున్నాయి. తరచూ పాఠశాల ఆస్తిని ధ్వంసం చేస్తూ విలువైన సామాగ్రిని ఎత్తుకెళుతున్నారు. తాజాగా గత రాత్రి పాఠశాల ఆవరణలోని ఇనుప పైప్‌లతో పాటు కూర్చోనే గద్దెను ధ్వంసం చేశారు. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.అశోక్ మాట్లాడుతూ గతంలో సైతం పాఠశాలలో ఆవరణలోని విలువైన సామాగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని, సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు సైతం పాల్పడ్డారని ఈ విషయమై పోలీసులకు సైతం ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ ఏదో విధంగా పాఠశాల ఆస్తిని ధ్వంసం చేస్తున్నారని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి రాత్రివేళల్లో పాఠశాలకు వాచ్‌మెన్‌ను నియమించాలని ఆయన కోరారు. పాఠశాల సామాజిక ఆస్తి అందరిదీ అని దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు.

సమాచారం లేకుండా అంగన్‌వాడీ కేంద్రాన్ని మార్చారు


నేరడిగొండ, మార్చి26: మండలంలోని సావర్గాం గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎలాంటి సమాచారం లేకుండా రోడ్‌సావర్గాంకు మార్చారని గ్రామస్థులు ఆరోపించారు. శనివారం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో కలిసి మాట్లాడుతూ గత నెల రోజుల నుంచి అంగన్‌వాడీ కార్యకర్త రాక పోవడంతో అనుమానం వచ్చి గ్రామస్థులు ఆరా తీయగా అంగన్‌వాడీ కేంద్రాన్ని రోడ్‌సావర్గాం గ్రామానికి ఎవరికి సమాచారం ఇవ్వకుండా మార్చారని ఆయా తెలుపడంతో గ్రామస్థులు సీడీపీఓ సూపర్‌వైజర్‌లకు ఫోన్ ద్వారా వివరణ కోరగా ఎలాంటి సమాధానం ఇవ్వలేదని గ్రామస్థులు ఆరోపించారు. మా కేంద్రాన్ని ఇతర గ్రామానికి తరలిస్తే ఊరుకునేది లేదని గ్రామస్థులు హెచ్చరించారు. యదావిధిగా మా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం నడిచేలా అధికారులు, చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్ద ఇందల్‌నాయక్, భీంరావ్, నారాయణ స్వామి, శివులాల్, రాజేశ్వర్, వినోద్, దారాసింగ్, లస్మన్న తదితరులున్నారు.

ఓటర్లను ప్రభావితం చేసే అంశాలను అరికట్టాలి

జైనథ్, మార్చి 26 : తెలంగాణ రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రభావిత చేసే మద్యం, గంజాయి అక్రమ డబ్బు తదితర అన్ని వస్తువులను పూర్తి స్థాయిలో అరికట్టాలని సీఆర్‌పీఎఫ్ సీఐ పోల్‌కం సూరజ్ అన్నారు. మంగళవారం జైనథ్ మండలంలోని ఆనంద్‌పూర్ మహారాష్ట్ర సరిహద్దున గల ఏర్పాటు చేసి తనిఖీ కేంద్రాన్ని అకస్మీకంగా తనిఖీ చేశారు. ఎక్సైజ్, రెవెన్యూ, పోలీసులు తదితర శాఖల అధికారులతో కలిసి మాట్లాడారు. సీఐ సూరజ్ అస్సాగౌహాతి ఎయిర్‌పోర్టు అధికారిగా విధులు నిర్వహించడంతో పాటు ప్రస్తుతం హైదరాబాద్ సీఆర్‌పీఎఫ్ సీఐగా విధులు నిర్వహిస్తున్నారు.సీఐ ఆనంద్‌పూర్ గ్రామానికి చెందిన పి.రాజేశ్వర్-లత దంపతుల చిన్న కుమారుడు మొదటిసారిగా ఆయన ఆనంద్‌పూర్‌కు రావడంతో ఆయన్ను సన్మానించారు. స్వగ్రామస్థులతో కలిసి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఆనంద్‌పూర్ చెక్‌పోస్టు ఇన్‌చార్జీ నాగరెడ్డి, ఆనంద్‌పూర్ గ్రామస్థులు బింగి అశోక్, బడాలడికేందర్‌రెడ్డి, భవానేసురేష్, ఎల్టిశ్రీనివాస్‌రెడ్డి, భూమన్న, గంగారెడ్డిలతో పాటు ఆనంద్‌పూర్ గ్రామ ప్రజలున్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన జోగురామన్న

జైనథ్, మార్చి 26 : మండల కేంద్రమైన బేలలోని బీఆర్‌ఎస్ యువజన విభాగం జిల్లా కో కన్వీనర్ కాటిపెల్లి స్వప్న తండ్రి స్వామిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మాజీ మంత్రి జోగురామన్న మంగళవారం బేల మండలానికి చేరుకుని మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. దీంతో పాటు మండలంలోని దహేగాం గ్రామంలో నాక్లిక్ అనిల్‌కుటుంబాన్ని పరామర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ బేల మండల పార్టీ అధ్యక్షులు కళ్లెంప్రమోద్‌రెడ్డి తదితరులున్నారు.



నూతన పద్ధతులతో అధిక దిగుబడులు

కుంటాల, మార్చి 26 : రైతులు మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో నూతన పద్ధతులను అవలంబిస్తే మరిన్ని లాభాలను పొందవచ్చునని వ్యవసాయాధికారులు సూచించారు. మంగళవారం కుంటాల రైతువేదికలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో గ్రామ గోపాలకృష్ణ ప్రధాన శాస్త్రవేత్త రాజేంద్రనగర్ హైదరాబాద్ డ్రోన్‌ల ద్వారా వ్యవసాయం గురించి రైతులకు వివరించారు. డీఏవో అంజిప్రసాద్ నిర్మల్ జిల్లాలో ఇఫ్కో కంపెనీ ద్వారా ఇప్పటికే దిలావర్‌పూర్, సారంగాపూర్, లక్ష్మణచాంద, పెంబి, చింతల్ చాంద మండలాల్లో డ్రోన్‌ల ద్వారా వ్యవసాయంపై ఆసక్తి చూపాలన్నారు.





కాంగ్రెస్ దూకుడు





- చక్రం తిప్పుతున్న సీతక్క
- జిల్లాలో సుడిగాలి పర్యటనలు చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి
- కొత్త చేరికలపై బీజేపీలో కదలిక కరువు
- స్తబ్దుగా ఉన్న కమలం పార్టీ నేతలు
- ఖానాపూర్ కాషాయంలో కనిపించని నాయకత్వం
- లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నా.. అసంతృప్తిలో రాథోడ్
- రాష్ట్ర రాజధానికే పరిమితమవుతున్న ఏలేటి

నిర్మల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రాజకీయ సమీకరణలు రోజు రోజుకు ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి. కాంగ్రెస్ మంచి దూకుడు మీద ఉంది. వద్దన్నా .. వచ్చి చేరుతున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల గెలుపుతో దూకుడును కొనసాగించిన బీజేపీ ఆ తరువాత నిశబ్ద వాతావరణం వైపు నిలుస్తుండడం చర్చనీయాంశంగా మారుతోంది. అయితే ఎన్నికల్లో ఓటమి చెందిన బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా బలహీన పడుతుండగా కాంగ్రెస్ పార్టీ మాత్రం పూర్వవైభవం దిశగా అడుగులు వేస్తోంది. మొన్నటి వరకు పూర్తిగా నైరాశ్యంలో ఉన్న కాంగ్రెస్ కేడర్ ప్రస్తుతం సమరోత్సాహంతో ముందుగులు వేస్తుండడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. జిల్లాలో మూడు ఈ అసెంబ్లీ నియోజకవర్గాలకు గానూ నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో బీజేపీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ రెండు నియోజకవర్గాల్లో మొదట ఆ పార్టీ ఎమ్మెల్యేలు విస్తృతస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించి తమ గెలుపు దూకుడును కొనసాగించారు. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆ పార్టీ శాసనసభా పక్షనేతగా ఎన్నికవ్వడం, దీనికి అనుగుణంగా ఆయన హైదరాబాద్‌లోనే ఎక్కువగా గడుపుతుండడంతో ఇక్కడి ఆ పార్టీ కార్యకలాపాలు కొంత మేరకు సన్నగిల్లాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీ మాత్రం పూర్తిగా నిర్వీర్యమైపోతున్న ఛాయలు నెలకొంటుండగా కాంగ్రెస్ పార్టీలో కొత్త ఉత్సాహం రెట్టింపవుతోంది. జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క ఇక్కడ విస్తృతంగా పర్యటిస్తూనే కార్యకర్తలతో సమీక్ష సమావేశాలు, సీరియస్‌గా మంతనాల కారణంగా ఆ పార్టీలోకి పెద్ద ఎత్తున వలసలు మొదలయ్యాయి. బీఆర్ఎస్ పార్టీకి చెందిన నేతలంతా వరుస కట్టి కాంగ్రెస్ పార్టీలో చేరుతుండగా ఆ పరిణామాలను బీజేపీ మౌనంగా చూస్తుండడం విస్మయానికి గురి చేస్తోందని అంటున్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరికలకు కౌంటర్ పెట్టి వారందరిని తమ వైపు తిప్పుకోవాల్సింది పోయి బీజేపీ నేతలు ఈ దిశగా స్పందించకపోతుండడం చర్చకు తావిస్తోందంటున్నారు. అయితే మంత్రి సీతక్క డైరెక్షన్‌లో గత కొద్ది రోజుల నుంచి బీఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నేతలంతా కాంగ్రెస్ పార్టీలో చేరుతుండడంతో ఆ పార్టీ కొంత మేరకు బలపడే అవకాశాలున్నాయంటున్నారు. ఈ చేరికల పరిణామాలు రాబోయే లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై కూడా ప్రభావం చూపే అవకాశాలు లేకపోలేదంటున్నారు. కాగా ఖానాపూర్ నియోజకవర్గంలో బీజేపీకి పూర్తి దిశానిర్దేశం కరువైందంటున్నారు. ప్రస్తుతం అక్కడ ఆ పార్టీ నాయకత్వ కొరతను ఎదుర్కొంటోందని చెబుతున్నారు. మొన్నటి ఎన్నికల్లో ఆ పార్టీ తరఫున పోటీ చేసి రమేష్ రాథోడ్ ఓటమి చెందగానే ఆ పార్టీ శ్రేణులు డీలా పడిపోయాయని అంటున్నారు. ఇక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన వెడ్మబొజ్జు ఎమ్మెల్యేగా గెలుపొందిన నాటి నుంచి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పార్టీ పటిష్ఠతకు పెద్దఎత్తున ప్రయత్నాలు చేస్తున్నారు. ఉట్నూర్ భారీ బహిరంగసభ నిర్వహింపజేసి ఆయన పార్టీ ఇమేజ్‌ను పెంచే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం ఆయన ఖానాపూర్‌తో పాటు నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల కాంగ్రెస్ శ్రేణులకు పెద్దదిక్కుగా మారారని అంటున్నారు. కాగా బీజేపీ పార్టీ లోక్‌సభ అభ్యర్థిగా ఆ పార్టీ అధిష్ఠానం మాజీ ఎంపీ నగేష్ పేరును ఖరారు చేయడం కూడా ఇక్కడి పార్టీలో ఉత్సాహలోపానికి కొంత మేరకు కారణమవుతోందని అంటున్నారు. ఆయన ఎంపికను జిల్లాకు చెందిన పలువురు సీనియర్ నేతలు మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

బీజేపీలో సన్నగిల్లిన ఉత్సాహం

బీజేపీలో కొంత మేరకు గత కొద్దిరోజుల క్రితం ఉన్న దూకుడు ప్రస్తుతం తగ్గిపోయిందని అంటున్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో ఆ పార్టీ కేడర్ సమరోత్సాహంతో పలు కార్యక్రమాలను నిర్వహించారు. అయితే లోక్‌సభ అభ్యర్థిత్వం ఖరారైనప్పటి నుంచి ఆ పార్టీలోని చాలా మంది సీనియర్ నేతలు తీవ్ర నిరాశకు గురయ్యారంటున్నారు. ప్రస్తుతం వారంతా క్రియాశీలంగా వ్యవహరించకుండా అచితూచి ధోరణి కనబరుస్తున్నారని చెబుతున్నారు. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శాసనసభా పక్షనేతగా హైదరాబాద్‌లో ఎక్కువగా గడుపుతున్న కారణంగా ఇక్కడ ఆ పార్టీ శ్రేణులు కొంత మేరకు నిరుత్సాహానికి లోనవుతున్నారని చెబుతున్నారు. ముథోల్ నియోజకవర్గంలో లోక్‌సభ టికెట్ ఆశించిన రాజేశ్‌బాబుతో పాటు మరికొంతమంది పార్టీ కార్యక్రమాలకు అంటీముట్టనట్లుగా ఉంటున్నారని, ఎమ్మెల్యే పాల్గొనే కార్యక్రమాలకు సైతం పెద్దగా హాజరుకావడం లేదంటున్నారు. ఇదిలా ఉండగా ఓ వైపు కాంగ్రెస్ పార్టీ తన దూకుడును ఉధృతం చేస్తున్నప్పటికీ బీజేపీలో మాత్రం మొన్నటి ఉత్సాహం కనిపించడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

చక్రం తిప్పుతున్న మంత్రి సీతక్క ఎమ్మెల్యే బొజ్జు

జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీని పూర్తిస్థాయిలో బలోపేతం చేసేందుకు ఇన్‌చార్జీ మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జులు పకడ్బందీగా పావులు కదుపుతున్నారంటున్నారు. మంత్రి సీతక్క జిల్లాలోనే ఎక్కువగా పర్యటిస్తూ నేతలు, కార్యకర్తలతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్, బీజేపీ పార్టీల్లోని అసంతృప్తివాదులందరినీ కాంగ్రెస్ పార్టీలో చేర్పించడమే లక్ష్యంగా మంత్రి, ఎమ్మెల్యేలిద్దరూ జోరుగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఆపరేషన్ ఆకర్ష్ పేరిట వీరు అమలు చేస్తున్న వ్యూహం జిల్లాలో సక్సెస్ అవుతోందని అంటున్నారు. ఇటీవల బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఒక్కొక్కరుగా కాంగ్రెస్ పార్టీలో చేరిపోతుండడం ఆ పార్టీకి కొత్త ఉత్సాహాన్ని ఇస్తోందంటున్నారు. డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు ఆధ్వర్యంలో వీరంతా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నప్పటికి చేరికల సమయంలో మాత్రం అగ్రనేతల ద్వారానే వీరందరికీ కండువాలు కప్పిస్తున్నారు. పార్టీలో చేరిన వారికి అలాగే సీనియర్ నేతలందరికి దశల వారిగా న్యాయం చేస్తామంటూ దీని కోసం గానూ లోక్‌సభ ఎన్నికల్లో వచ్చే మెజార్టీని ప్రతిపాదిక చేసుకోనున్నట్లు పేర్కొంటున్నారు.

ఖానాపూర్ కాషాయంలో దిశా నిర్దేశం కరువు

ప్రస్తుతం నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో బీజేపీకి ఆ పార్టీ ఎమ్మెల్యేలు నేతృత్వం వహిస్తుండగా ఖానాపూర్‌లో మాత్రం సరియైన నాయకత్వం లేక కమల శ్రేణులు డైలామాకు గురవుతున్నారంటున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేసి ఓటమి చెందిన రమేష్ రాథోడ్ తిరిగి లోక్‌సభ టికెట్‌ను ఆశించారు. అయితే టికెట్ విషయంలో పార్టీ సీనియర్‌లు ఆయనకు హామీనిచ్చినట్లు ప్రచారం జరిగింది. కాగా అందుకు భిన్నంగా రమేష్ రాథోడ్‌ను పక్కన పెట్టి బీజేపీలో కొత్తగా చేరిన బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ గోడం నగేష్‌కు లోక్‌సభ టికెట్ ఇవ్వడం ప్రస్తుతం గందరగోళానికి కారణమవుతోందని అంటున్నారు. ఈ వ్యవహారాన్ని రాథోడ్ రమేష్ జీర్ణించుకోకుండా తన వర్గంతో మంతనాలు జరుపుతున్నట్లు పేర్కొంటున్నారు. దీని కారణంగా ప్రస్తుతం ఖానాపూర్ నియోజకవర్గంలో బీజేపీకి నాయకత్వ కొరత ఏర్పడిందని అంటున్నారు. ఇలా పార్టీ పరమైన కార్యక్రమాలు నెమ్మదిస్తుండడంతో కార్యకర్తలు అయోమయానికి లోనవుతున్నారంటున్నారు.

అమ్మవారి హుండీ కానుకల లెక్కింపు



హుండీ కానుకలను లెక్కిస్తున్న భక్తులు, ఉద్యోగులు

బాసర, మార్చి, 26 : బాసర సరస్వతీ అమ్మవారి హుండీ కానుకలను మంగళవారం ఆలయ అధికారులు లెక్కింపు చేపట్టారు. రూ. 77,09,340 లు నగదు, మిశ్రమ బంగారం 62 గ్రాములు, మిశ్రమ వెండి 3 కిలోల 510 గ్రాములు, వివిధ దేశాలకు చెందిన కరెన్సీలు 208 హుండీల్లో వచ్చినట్లు తెలిపారు. ఈ ఆదాయం మొత్తం 77 రోజుల్లో దేవస్థానానికి సమకూరింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో విజయ రామారావు, చైర్మన్ శరత్‌పాఠక్, ఏఈవో సుదర్శన్‌గౌడ్, సూపరింటెండెంట్‌లు సంజీవ్‌రావు, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అడెల్లి ఆలయంలో..

సారంగాపూర్, మార్చి 26 : మండలంలోని మహాప్రసిద్ధి గాంచిన అడెల్లి మహాపోచమ్మ ఆలయ హుండీ లెక్కింపును నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో రంగు రవికిషన్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ హుండీ లెక్కింపు ఉదయం 11 గంటలకు ఉంటుందని ఆయా గ్రామాల నుండి ప్రజాప్రతినిధులు, భక్తులు హాజరు కావాలని ఆయన కోరారు.

మూడోరోజు నవ చండీయాగం



చండీయాగం చేస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, మార్చి 26 : నిర్మల్ గీత పారిశ్రామిక సహకార సంఘం, గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మల్ సమీపంలోని అక్కాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ మాత విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలలో భాగంగా మంగళవారం నవ చండీయాగం నిర్వహించారు. 35 మంది దంపతులు హోమంలో పాల్గొని 13 అధ్యాయాలతో నవ చండీయాగం చేశారు. ఐదురోజుల కార్యక్రమంలో భారీ ఎత్తున గౌడ కులస్తులు పాల్గొంటున్నారు. దైవజ్ఞ గురుమంచు చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో ఘనపాటి మణికంఠ శర్మ, వేద పండితులు విద్యాసాగర్ శాస్త్రి, శివ రామకృష్ణ, వినోద్‌కుమార్ సహా తిరుపతి, బీదర్, అచ్చులాపూర్ తదితర ప్రాంతాల నుంచి వేద పండితులు పాల్గొన్నారు. సోమవారం జలాధివాసం చేసిన రేణుక ఎల్లమ్మ సహా జమదగ్ని, వినాయకుడు ఇతర విగ్రహాలను ఆలయ ప్రాంగణానికి తరలించారు. మంగళవారం విగ్రహాలను ధాన్యాధివాసం కార్యక్రమంతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడసంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

లహరి బస్సులో ప్రయాణిస్తే 10 శాతం రాయితీ : డీఎం

నిర్మల్ కల్చరల్, మార్చి 26 : ఆర్టీసీ కొత్తగా ప్రవేశపెట్టిన లహరి ఏసీ బస్సుల్లో 10 శాతం రాయితీ లభిస్తుందని, ప్రయాణికులు ఈ అవకాశం వినియోగించుకోవాలన్నారు. మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేస్తూ ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం ఇటీవల లహరి బస్సులను ప్రవేశపెట్టిందన్నారు. ఆధునిక సౌకర్యాలు లహరి బస్సుల్లో కల్పించిందన్నారు. నిర్మల్ డిపోకు 8 నాన్ ఏసీ, 2 ఏసీ బస్సులు కేటాయించారన్నారు. నాన్ ఏసీ బస్సులు ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలు, పామూరు. కందుకూరు నడుపుతున్నామన్నారు. ఏసీ బస్సులను శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు నడిపిస్తున్నట్లు తెలిపారు. ఏసీ స్లీపర్ సీట్ బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ కల్పిస్తున్నామన్నారు. నిర్మల్ నుంచి ఎయిర్‌పోర్ట్‌కు సీటరుకు 910, స్లీపర్‌కు 1180 చార్జీ ఉంటుందన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

- సీఎస్‌కు వివరించిన కలెక్టర్

నిర్మల్ కల్చరల్, మార్చి 26 : జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ చీఫ్ సెక్రటరీ శాంతికుమారికి వివరించారు. సీఎస్ మంగళవారం సాయంత్రం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లు, త్రాగునీటి సమస్యలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమీక్షలో పాల్గొన్నారు. ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ వివరిస్తూ జిల్లాలో 203 కొనుగోలు కేంద్రాలు ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. వరి ధాన్యం అక్రమ రవాణా జరుగకుండా స్వర్ణ, బెల్ తరోడా, బిద్రెల్లిలలో అంతర్ రాష్ట్ర చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేశామన్నారు. త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని భగీరథ, పంచాయతీ అధికారులతో ఎప్పటికప్పుడు సమస్యలు రాకుండా చూడాలని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, డీపీవో శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సందీప్, సివిల్ సప్లై అధికారి నందిత, డీఎం శ్రీకల, తదితర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్

ఎన్నికల సిబ్బందికి నేటి నుంచి శిక్షణ

నిర్మల్ కల్చరల్, మార్చి 26 : పార్లమెంట్ ఎన్నికల్లో పాల్గొనే సిబ్బందికి ఈ నెల 27 బుధవారం నుంచి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం శిక్షణ కోసం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ... ర్యాండమైజేషన్ పద్ధతిన ఎంపిక చేసిన సిబ్బందికి ఎన్నికల విధులపై శిక్షణ అందించాలన్నారు. 27న ఉదయం 10 గంటల నుంచి కలెక్టర్ సమావేశ మందిరంలో శిక్షణ ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. పీవోలు, ఏపీవోలకు ఏప్రిల్ 1, 2 తేదీల్లో ఖానాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్ అధికారులకు అక్కడి బాలికల ఉన్నత పాఠశాలలో శిక్షణ ఉంటుందన్నారు.

నిర్మల్ సెగ్మెంట్ వారికి సెయింట్ థామస్ స్కూల్, ముథోల్ సెగ్మెంట్ సిబ్బందికి ట్రిపుల్ ఐటీ బాసరలో శిక్షణకు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు శిక్షణకు విధిగా హాజరుకావాలని సూచించారు. శిక్షణకు గైర్హాజరైతే ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, శిక్షణల నోడల్ అధికారి డీఈవో రవీందర్ రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు శ్రీనివాస్, ఈడీఎం నదీమ్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

లోకేశ్వరం వార్డెన్‌పై అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న టీవీపీ సంఘ నాయకులు

నిర్మల్ కల్చరల్, మార్చి 26 : లోకేశ్వరం ఎస్సీ హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్య వైఖరిపై తెలంగాణ విద్యార్థి పరిషత్ నాయకులు అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌కు తగిన చర్య తీసుకోవాలంటూ మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అర్గనైజింగ్ కార్యదర్శి కే. ప్రవీణ్ మాట్లాడుతూ... విద్యార్థులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సరైన భోజనం అందించడం లేదని తెలిపారు. మరుగుదొడ్ల సౌకర్యం లేదని, పరిసరాల అశుభ్రత వల్ల విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. నైట్ వాచ్‌మెన్ సరిగా రావడం లేదని, సమస్యలపై ప్రశ్నిస్తే టీఎన్జీవో నాయకుడినని బెదిరిస్తున్నాడని పేర్కొన్నారు. వార్డెన్‌ను సస్పెండ్ చేసి వేరే వారిని నియమించాలని డిమాండ్ చేశారు. నిర్మల్ పట్టణ కోకన్వీనర్ జాదవ్ మిథున్, కృష్ణ, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

పాముకాటుతో యువరైతు మృతి

- నాటు వైద్యం వికటించి మృతి చెందాడని భార్య ఫిర్యాదు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

దస్తూరాబాద్, మార్చి 26 : మండలంలోని గొడిసిర్యాల గోండుగూడ గ్రామానికి చెందిన భుజంగ్ రావు(26) అనే వ్యక్తి వారం రోజుల క్రితం పాము కాటుకు గురికావడంతో చికిత్స నిమిత్తం నాటు వైద్యుడి దగ్గరకు తీసుకెళ్లి ప్రాణం మీదకు తెచ్చుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గొడిసిర్యాల పరిధిలో గోండుగూడకు చెందిన భుజంగ్‌రావు అనే కూలీ ఈ నెల 18వ తేదీన తన గ్రామంలోని ఓ రైతు వద్ద కూలీకి వెళ్లగా పంట పొలంలో పాము కాటుకు గురయ్యాడు. వెంటనే సదరు యజమాని, కుటుంబ సభ్యులు నాటు వైద్యం నిమిత్తం మండలంలోని ఆకొండపేట్ గ్రామానికి చెందిన ఓ నాటు వైద్యుడి దగ్గరకు తీసుకెళ్లారు. సదరు నాటు వైద్యుడు నయం చేస్తానని డబ్బులు సైతం తీసుకున్నాడు. వారం రోజుల పాటు మృతుడి ఇంటికి వచ్చి వైద్యం చేస్తున్న నయం కాక పరిస్థితి విషమిస్తుందని కుటుంబీకులు వారిస్తున్నా సదరు నాటు వైద్యుడు నేనే చికిత్స చేస్తానని చెట్ల మూలికలు పోశాడు. పాము కాటుకు గురైన వ్యక్తి పరిస్థితి విషమంగా ఉండడంతో సోమవారం కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కొరకు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. తమ వద్ద రూ.15 వేలు తీసుకొని నయం చేస్తానని చెప్పిన నాటు వైద్యుడి మూలంగానే నా భర్త చనిపోయాడని మృతుడి భారయ ఆరోపిస్తుంది. తన భర్త మరణానికి కారణమైన నాటు వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు స్థానిక ఎస్సై యాసిర్ అరాఫత్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



భుజంగ్‌రావు మృతదేహం

సంక్షిప్త సమాచారం

పొదుపుతోనే లాభాలు



కుంటాల మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న ఏపీఎం

కుంటాల, మార్చి, 26 : మహిళలు పొదుపుతోనే అధిక లాభాలు పొందవచ్చునని ఏపీఎం అశోక్ అన్నారు. మంగళవారం కుంటాల మండల సమాఖ్య కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు నుంచి పొందిన రుణాలను ఎప్పటికప్పుడు చెల్లిస్తే మరికొన్ని సంఘాలకు రుణాలు అందించే అవకాశం ఉంటుందని కావున ప్రతి సంఘాల సభ్యులు రుణాలు సకాలంలో చెల్లించాలని సూచించారు.


పెంచికల్‌పాడ్‌లో ఆవుకు సీమంతం



పెంచికల్‌పాడ్ గ్రామంలో సీమంతం నిర్వహించిన ఆవుతో రైతు

కుంటాల, మార్చి 26 : మండలంలోని పెంచికల్ పాడ్ గ్రామంలో మంగళవారం గ్రామ రైతు గురజాల నర్సయ్య తన ఆవుకు సంప్రదాయబద్ధంగా సీమంతం చేశారు. మామూలుగా నేటి సమాజంలో మనషులకు మాత్రమే సీమంతం నిర్వహిస్తారు. రైతు తన ఆవు పట్ల మమకారంతో ఇట్టి కార్యక్రమం నిర్వహించి ఆవుకు చీరె, సారె సమర్పించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆవుకు సీమంతం నిర్వహించడం పట్ల రైతును అభినందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాంరావు పటేల్

కుంటాల, మార్చి, 26 : మండలంలోని అందకూర్ గ్రామంలో ఇటీవల గుండె నొప్పితో మృతి చెందిన కట్ట మోహన్ కుటుంబ సభ్యులను మంగళవారం ముథోల్ ఎమ్మెల్యే రాంరావు పటేల్ పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. అధైర్య పడ వద్దన్నారు. ఈయన వెంట గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు పృథ్వీధర్‌రావుతో పాటు ప్రశాంత్, గ్రామస్థులు ఉన్నారు.